క్లుప్తంగా

ఆంధ్ర కేసరికి నివాళి



టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బోట్‌క్లబ్ వాకర్స్ సంఘ నాయకులు

కాకినాడ రూరల్: స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం నివాళులర్పించారు. విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు, అడబాల రత్న ప్రసాద్, రెడ్నం రాజా, తదితరులు నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



ఉపాధి కూలీలకు మజ్జిగ అందజేస్తున్న నాయకులు

కరప: మండలంలోని నడకుదురులో ఉపాధి కూలీలకు వైఎస్సార్ సీపీ నాయకులు మజ్జిగ పంపిణీ చేశారు. సర్పంచ్ డేగల లలితకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు పైలా రామతులసి, గోవిందు దంపతులు, వార్డు సభ్యుడు పోతల లోవప్రసాద్ సొంత ఖర్చుతో శనివారం 200 మందికి చల్లటి మజ్జిగ అందజేశారు.

రేపు మంత్రిప్రగడ వర్ధంతి

బోట్‌క్లబ్: స్థానిక సినిమారోడ్డులోని మంత్రిప్రగడ వారి సత్రం వ్యవస్థాపకుడు మంత్రిప్రగడ నరసింహారావు పంతులు వర్ధంతి సభ సోమవారం నిర్వహిస్తున్నట్టు ఈఓ సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిరుపేదలకు వస్త్రదానం, అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

కాకినాడ లీగల్: ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, అనవసర గొడవల విషయాల్లో వెళ్లడం వలన మీకు, మీ కటుంబ సభ్యులకు సమాజంలో ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటారని కాకినాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.లీలా శ్యాం సుందరి తెలిపారు. స్థానిక స్పెషల్ సబ్‌జైల్‌ను ఆయన శనివారం పరిశీలించారు. ఎవరికైనా న్యాయవాదులను పెట్టుకునే స్థోమత లేకపోయినా మండల న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సబ్ జైలులో ఉన్నప్పుడు వివిధ పుస్తకాలు చదివి మీలో ఉన్న చెడు గుణాలను దూరం పెట్టాలని సూచించారు. అనేక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ ఎం.వీ రబాబు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



వలంటీర్‌ను ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీఓ స్వప్న

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామ వలంటీర్ పోస్టులు భర్తీకి ఎంపీడీఓ కర్రె స్వప్న ఇంటర్వ్యూలు నిర్వహించారు. కూరాడలో రెండు, గురజనాపల్లిలో ఒకటి ఖాళీ లుండగా నలుగురు దరఖాస్తుదారులు వచ్చారని ఆమె తెలిపారు. పాతర్లగడ్డలో ఒకటి, గొర్రిపూడిలో రెండు పోస్టులు ఖాళీలుండగా ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోలేదని, తర్వాత నోటిఫికేషన్‌లో మళ్లీ పిలుస్తామని ఎంపీడీఓ తెలిపారు.

ఎమ్మెల్యే కన్నబాబు పరామర్శ

కరప: మండలం వేములవాడలో శనివారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పలువురి కుటుంబాలను పరామర్శించారు. వేములవాడలో అప్పనపల్లి రాజు మృతిచెందగా అతని కుమారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు అప్పనపల్లి శివరామకృష్ణ (పెద్ద), ఇతర కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పార్టీ నాయకులు ఆయన వెంట ఉన్నారు. అలాగే పుత్రశోకంతో బాధ పడుతున్న పెనుమర్తి సర్పంచ్ పెంకే ఆనందకుమార్‌ను నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ శనివారం ఓదార్చారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి

కాకినాడ సిటీ: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను తక్షణం అరెస్టు చేసి, హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, కార్మిక, మహిళా సంఘాల ఆధ్వర్యంలో కాకినాడలో శనివారం ర్యాలీ నిర్వహించారు. సుందరయ్య భవన్ నుంచి కలెక్టరేట్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం జేసీ ఇలక్కియకు వినతి పత్రం అందించారు. ఈ ధర్నాను ఉద్దేశిస్తూ ఉద్యోగ, కార్మిక, మహిళా సంఘాల నాయకులు బోడకొండ, జె.వెంకటేశ్వరరావు, దువ్వా శేషుబాబ్జీ, గదుల సాయిబాబు, తాళ్లూరి రాజు పాల్గొన్నారు.

స్మార్ట్ పనులు 4 నెలల్లో పూర్తి



స్కేటింగ్ రింక్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల తదితరులు

- ప్రజోపయోగ పనులకే నిధులు
- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- ఎంపీ గీతతో కలసి స్కేటింగ్ రింక్ పనుల పరిశీలన

కాకినాడ: నగరపాలక సంస్థ నూతన భవనం మినహా స్మార్ట్ సిటీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ నాలుగు నెలల్లో పూర్తిచేసి వినియోగంలోకి తెస్తామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక రాజాట్యాంక్ పార్కులోని స్కేటింగ్ రింక్‌ను ఎంపీ వంగా గీత, కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, అధికారులతో కలసి సందర్శించారు. స్కేటింగ్ రింక్ పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనులు నత్తనడకనసాగుతున్నాయంటూ ఇటీవల టీడీపీ నేతలు చేసిన విమర్శలపై మండిపడ్డారు. ఒకరితో వేలెత్తి చూపించుకునేలా తమ పరిపాలన ఉండదని, ఒక క్రమ పద్ధతిలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామన్నారు. గత టీడీపీ హయాంలో కమీషన్ల కోసం కక్కుర్తిపడి అవసరంలేని అభివృద్ధి పనులకు స్మార్ట్ సిటీ నిధులు కేటాయించారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంపీ గీత సమన్వయంతో తాను ప్రత్యేక దృష్టి సారించి స్మార్ట్ సిటీ నిధులను ప్రజోపయోగ పనుల కోసం వెచ్చించామన్నారు. ప్రతిపాదిత పనులన్నింటినీ నాలుగు నెలల్లో పూర్తి చేసి చూపిస్తామని, అవసరమైతే టీడీపీ నేతలను కూడా తీసుకువెళ్లి చేసిన పనుల ప్రగతిని చూపించేందుకు సైతం సిద్ధమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్కేటింగ్ రింక్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అతిత్వరలోనే వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎమ్మెల్సీ అభ్యర్థిని కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకట్రావు, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని, రోకళ్ల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిపాముల గణపతి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల లెక్క ఇక పక్కా

- సర్వే ద్వారా లెక్కింపు ప్రక్రియ
- 500 మంది సిబ్బంది తోడ్పాటు
- ఇక నియంత్రణకు కార్యాచరణ



కుక్కల లెక్కింపు ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్

కాకినాడ: ప్రజలకు నరకం చూపిస్తున్న శునకాలను నియంత్రించే దిశగా నగరపాలక సంస్థ మరో అడుగు ముందుకు వేసింది. కుక్కల సంతతిని నియంత్రించేందుకు చర్యలు తీసుకునే క్రమంలో నగరంలో ఎన్ని కుక్కలు ఉన్నాయనే అంశంపై శుక్రవారం నగరపాలక సంస్థ పశు సంవర్ధకశాఖ సమన్వయంతో నగరమంతా ఏకకాలంలో సర్వే నిర్వహించారు. యానిమల్ వెల్ఫేర్ బోర్డు నిబంధనలను అనుసరించి కుక్కలు తెల్లవారు జామున 3.30 నుంచి 6 గంటల మధ్యలో వీటి లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు. కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 100 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయ పరిధిలో అక్కడి కార్యదర్శి, నలుగురు వలంటీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సమన్వయం చేసుకుంటూ నిర్దేశించిన సమయంలో ప్రతి వీధికి వెళ్లి కుక్కల సంఖ్యను లెక్కించారు. అలా నగర పరిధిలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది వెరసి 550 మంది ఒకేసారి కుక్కల లెక్కింపు ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్నారు.

కమిషనర్ సందర్శన

నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల శునకాల లెక్కింపు ప్రక్రియను ఉదయం 3.30 గంటలకే వెళ్లి స్వయంగా పర్యవేక్షించారు. జగన్నాథపురం, ఘాటీ సెంటర్, ఆర్డీవో కార్యాలయం ప్రాంతాల్లో లెక్కింపు ప్రక్రియ జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, పశు సంవర్ధకశాఖ జేడీ సూర్యప్రకాశరావు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, స్నాప్ సంస్థ ప్రతినిధి శ్యామ్ తదితరులు వేర్వేరు ప్రాంతాల్లో జరుగుతున్న ప్రక్రియను పర్యవేక్షించారు. అలాగే వెటర్నరీ వైద్యులు, ఉద్యోగులు నగరపాలక సంస్థ సిబ్బందికి అవసరమైన తోడ్పాటును అందించారు.

ఇక నియంత్రణ దిశగా..

రేబిస్ రహిత నగరంగా కాకినాడను తీర్చిదిద్దే క్రమంలో తొలివిడత శునకాల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యింది. ఇప్పటికే కార్పొరేషన్ పరిధిలో యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) ఆపరేషన్లు చేసే కేంద్రం అందుబాటులో ఉంది. అక్కడ రోజుకి 10 నుంచి 12 కుక్కలకు ఆపరేషన్లు చేస్తున్నారు. ఇప్పటికే 9 వేల శునకాలకు ఆపరేషన్ ప్రక్రియ పూర్తయినట్టు కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు లెక్క తేలాక అవసరమైన ప్రణాళికను రూపొందించి అదనపు ఏబీసీ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ దిశగా నగరపాలక సంస్థ యంత్రాంగం దృష్టిసారిస్తోంది.

పాత వస్తువుల సేకరణకు శ్రీకారం

- ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే, కమిషనర్
- 14 ప్రాంతాల్లో సేకరణకు ఏర్పాట్లు



పాత వస్తువుల సేకరణలో పాల్గొన్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ: కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ సూచన మేరకు 'మేరీలైఫ్-మేరా స్వచ్ఛ షహర్'లో భాగంగా శనివారం నుంచి పాత వస్తువుల సేకరణ ప్రక్రియకు నగరపాలక సంస్థ శ్రీకారం చుట్టింది. రెడ్యూస్-రీసైకిల్-రీయూజ్ విధానంలో ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న బట్టలు, పుస్తకాలు, బొమ్మలు, పాదరక్షలు వంటి రీసైక్లింగ్‌కు ఉపయోగపడే వస్తువులను 20 రోజుల పాటు సేకరించాలన్నది ఈ కార్యక్రమ లక్ష్యం. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని స్థానిక వివేకానందపార్కు ఆవరణలో శనివారం ప్రారంభించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వద్ద నిరుపయోగ వస్తువులను ఇక్కడ అందజేశారు. రెండు కేజీలకు మించి బరువు ఉన్న వస్తువులు అందజేసిన వారికి కమిషనర్ పేరిట సర్టిఫికెట్లను అందజేశారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగరంలో ఎంపిక చేసిన 14 ప్రాంతాల్లో ఈ వస్తువులను స్వీకరించనున్నారు. వచ్చే నెల ఐదో తేదీ వరకు పాత వస్తువుల సేకరణ కొనసాగనుంది.

ప్రజలు స్పందించాలి : ఎంపీ

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న వస్తువులను రీసైక్లింగ్ కోసం ప్రతి ఒక్కరూ అందజేయాలని ఎంపీ గీత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో వస్తుసేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసినందున ప్రజలంతా సమీపంలోని కేంద్రం వద్ద పాత వస్తువులను అందజేయాలని సూచించారు. ఇరుగుపొరుగు వారిని కూడా చైతన్య పరిచి ఇలాంటి మంచి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని అన్నారు. కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న 45 రకాల వ్యర్థాలను నిర్దేశించిన కేంద్రాల్లో అందజేయవచ్చునన్నారు. సుమారు 5 నుంచి 10 టన్నుల పాత వస్తువులు సేకరించే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మహేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని తదితరులు స్వయంగా తమ ఇళ్లలోని పాత వస్తువులను అందజేశారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకట్రావు, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డీఈ మాధవి, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణ పరిరక్షణకు క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్‌ఏ సీఈఓ షేక్ ఇమ్రాన్

- డీఎస్ఏ సీఈఓ షేక్ ఇమ్రాన్
- సెట్రాజ్, ఎన్‌వైకేల సంయుక్త ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ

నాగమల్లితోట జంక్షన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా శనివారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రెండు కిలోమీటర్ల సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎస్ఏ సీఈఓ షేక్ ఇమ్రాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్ఏ, సెట్రాజ్, నెహ్రూ యువక్ కేంద్ర ఆధ్వర్యంలో ఈ ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని దీనిపై అవగాహన కల్పించడం కోసం ఈ ర్యాలీని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం క్రీడాకారులతో ప్రభుత్వం నిర్దేశించిన వెబ్‌సైట్‌లో ప్రతిజ్ఞ చేయించారు. డీఎస్ఏ ముఖ్య శిక్షకులు శ్రీనివాస్ కుమార్, కోచ్‌లు మహ్మద్ అలీషా, నాగేంద్ర, ప్రవీణ్, స్వామి, తరుణ్, శ్రీనివాస్, 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ టోర్నీ విజేత తూర్పు

పశ్చిమగోదావరి జిల్లా ఉలంపర్రులో ఈ నెల 17 నుంచి 19 వరకు జరిగిన అండర్-16 యూత్ చాంపియన్ షిప్‌లో బాస్కెట్‌బాల్ విభాగంలో జిల్లా క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనపరిచారని డీఎస్ఏ సీఈఓ షేక్ ఇమ్రాన్ శనివారం తెలిపారు. బాలికల విభాగంలో బంగారు, బాలుర విభాగంలో రజత పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను, కోచ్ రుద్రను షేక్ ఇమ్రాన్, చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ డీఎస్ఏ లో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత

నాగమల్లితోట జంక్షన్: క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ట్రాఫిక్ సీఐ చైతన్య కృష్ణ పేర్కొన్నారు. స్థానిక జిల్లా క్రీడా మైదానంలో శనివారం వీకెండ్ పోటీలలో భాగంగా అథ్లెట్లకు అండర్-10, 13 విభాగాల్లో 800 మీటర్ల రిలే పోటీలు నిర్వహించారు. సాయంత్రం విజేతలకు చైతన్య కృష్ణ బహుమతులు అందజేశారు. చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్, అథ్లెట్ కోచ్ ప్రవీణ్ కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేతలతో ముఖ్య అతిథి చైతన్య కృష్ణ

సమష్టి కృషితోనే జేఎన్‌టీయూకేకి గుర్తింపు

బాలాజీచెరువు: సమష్టి కృషితోనే జేఎన్‌టీయూకేకు ఏ ప్లస్ హోదా వచ్చిందని వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు వచ్చిన సందర్భంగా శనివారం సాయంత్రం టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ గుర్తింపుతో అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించేందుకు వీలు కలుగుతుందని, అన్ని విభాగాల్లో కన్సల్టెన్సీ సేవలు మరింత పెంచాలన్నారు. త్వరలో ఎమ్మెస్సీ డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మెషీన్ లెర్నింగ్ కోర్సులు ప్రవేశపెడుతున్నామన్నారు. ఈ నెల 31న నిర్వహించే స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వీసీ ప్రసాదరాజును భారీ గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సుమలత పాల్గొన్నారు.



వీసీ ప్రసాదరాజును సత్కరిస్తున్న వర్సిటీ అధికారులు

100 ద్విచక్ర వాహనాల సీజ్

కాకినాడ క్రైం: నగర ట్రాఫిక్ విభాగం పరిధిలో ద్విచక్రవాహనాల తనిఖీలు ముమ్మరంగా జరిగాయి. గత మూడు రోజుల్లో వివిధ ఉల్లంఘనల కింద వంద ద్విచక్రవాహనాలను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ చైతన్య కృష్ణ బృందం ఈ తనిఖీలు చేపట్టింది. ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, సైలెన్సర్లు తొలగించి భారీ చప్పుళ్లతో ద్విచక్ర వాహనాలు నడపడం వంటి పలు ట్రాఫిక్ ఉల్లంఘనల్లో చోదకుల్ని పట్టుకున్నారు. పట్టుబడ్డవారంతా యువకులు, మైనర్లు కావడం గమనార్హం. దీంతో వారి తల్లిదండ్రుల్ని శనివారం పిలిపించిన పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులు సైతం బాధ్యులవుతారని వివరించి చెప్పారు. పోలీస్ శాఖ చర్యలు ఎదుర్కోవడమే కాక, కోర్టుకు హాజరుకావలసి ఉంటుందని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి ద్విచక్రవాహనాలు నడిపిన చోదకులందరిపైనా కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



తనిఖీల్లో పట్టుబడ్డ ద్విచక్రవాహనాలు

వ్యక్తి అదృశ్యం

కాకినాడ రూరల్: కాకినాడ నగరం విద్యుత్ నగర్ నాన్సీ వీధికి చెందిన చలికి వీరేంద్ర అదృశ్యంపై సర్పవరం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు సీఐ ఆకుల మురళీకృష్ణ శనివారం తెలియజేశారు. ఈనెల 15న ఇన్నోవా (ఏపీ39వి 5403) కారులో విజయవాడ వెళ్ళిన వీరేంద్ర 18న మధ్యాహ్నం 2.30 గంటల నుంచి కనిపించడం లేదన్నారు. చివరిగా కొవ్వూరు టోల్ గేట్ వద్ద క్రాస్ చేసినట్టు నమోదైందని, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆచూకీ లభిస్తే సీఐ సెల్ నంబర్ 94407 96554, డీఎస్పీ నంబర్ 94407 96505కు సమాచారం ఇవ్వాలని కోరారు.



చలికి వీరేంద్ర

కలెక్టర్ ఆమోదానికి విలువ ఆధారిత సవరణలు

కాకినాడ సిటీ: స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కెట్ విలువ ఆధారిత సవరణల కమిటీ సమావేశం శనివారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో బీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి సంవత్సరం భూమి విలువ మార్కెట్ ఆధారిత సవరణల ప్రక్రియకు సంబంధించి వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువకు నిర్ధారణ కమిటీ సమావేశం నిర్వహించామన్నారు. ఈ కమిటీ సవరణలను కలెక్టర్ ఆమోదానికి పంపించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాకినాడ రెవెన్యూ డివిజన్‌లోని జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

అకాల వర్షంతో అవస్థలు



కరప సమీపంలో కళ్లాల్లో ఉన్న ధాన్యపు రాశులు

- నేలకొరిగిన వృక్షాలు
- స్తంభించిన ట్రాఫిక్
- తడిసిపోయిన ధాన్యపు రాశులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లా వ్యాప్తంగా శనివారం ఈదురుగాలులతో వర్షం పడడంతో అన్నదాతలకు అవస్థలు తప్పలేదు. జిల్లాలో 90 శాతంపైగా వరి నూర్పిడులు కాగా రైతులు ధాన్యం కళ్లాలోనే ఉంది. అకస్మాత్తుగా వర్షం కురవడంతో రైతులు వాటిని కాపాడుకొనేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది. జిల్లాలోని పలు మండలాల్లో రోడ్లపై చెట్లు కూలడంతో ట్రాఫిక్ స్తంభించింది. కాకినాడ నడకుదురు మధ్య మూడు భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో సుమారు మూడు గంటల పాటు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. పోలీసులు సహాయక చర్యలు చేపట్టి భారీ వృక్షాలను నరికి ట్రాఫిక్ క్లియర్ చేశారు. సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. పలు మండలాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకు ఒరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చీకటి పడడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది విద్యుత్ పునరుద్ధరించేందుకు ఇబ్బందులు పడ్డారు.

చిరుజల్లులతో ఉపశమనం

ఉక్కపోత, వేడిగాలులతో 20 రోజులుగా బాగా ఇబ్బంది పడుతున్న ప్రజలకు శనివారం సాయంత్రం పడిన చిరుజల్లులు ఉపశమనాన్నిచ్చాయి. ఉదయం నుంచి వేడిగాలులు వీచి సాయంత్రం ఐదు గంటల తర్వాత వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చి చల్లగాలి వీచింది. అనంతరం హోరున వర్షం పడడంతో పాటు చల్లగాలి వీయడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు. అకస్మాత్తుగా పడిన వర్షంతో చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. అలాగే ప్రధాన కూడళ్లలో వెలిసిన మామిడి దుకాణాల్లోనూ బేరాల్లేకుండా పోయాయి.

ఆందోళనలో రైతులు

కరప: మండలంలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడగా, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉష్ణతాపం నుంచి ప్రజలు ఉపశమనం పొందినా, రైతుల గుండెల్లో రైళ్లు పరుగెట్టాయి. లేతగా ఊడ్చిన వరిచేలు కోతకు రావడంతో మాసూళ్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షంతో ధాన్యం రాశులు తడిసిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మెషీన్‌తో కోయించి, మెరక ప్రదేశాల్లో, లే అవుట్లలో, రోడ్డుపక్కన ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయి నష్టపోయామని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎక్కడ ధాన్యం అక్కడే మడుల్లో ఉండిపోయిందని, ఆ ధాన్యాన్ని బయటకు తేవాలంటే కూలీ ఎక్కువవుతుందని రైతులు అంటున్నారు. ఈదురుగాలులకు మామిడికాయలు రాలిపోయి నష్టపోయామని రైతులు తెలిపారు. నడకుదురు, తూరంగి మధ్య 11 కేవీ విద్యుత్‌లైన్‌పై గాలికి చెట్టుకొమ్మలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాను 4 గంటల పాటు నిలిపివేశారు. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.



కాకినాడలో కురుస్తున్న వర్షపు జల్లులు